ఈవారం కథ

ధైర్యం

నాని.ఎం

రెండు రోజుల సెలవుల తర్వాత సోమవారంనాడు ఆఫీసుకి రాగానే క్రాస్‌రోడ్స్ రివ్యూ అంటూ శని, ఆదివారాలలో తను చూసిన సినిమాల గురించి చెప్పే నా కొలీగ్ లత ఆ రోజు సింపుల్‌గా "హెలో గుడ్ మార్నింగ్ నాని" అని కామ్‌గా ఫైల్‌లో తల దూర్చడం నాకు ఆశ్చర్యం అనిపించింది.

లతలా నవ్వుతూ, నవ్వించే మనుష్యులు చాలా అరుదుగా వుంటారనడం నిజంగా అతిశయోక్తి కాదు. అటువంటి లత ఆ రోజు అలా డల్‌గా వుండడం నాకు ఆశ్చర్యం కలిగించింది.

"ఆర్ యూ ఆల్ రైట్"అని అడిగాను.

"అఫ్‌కోర్స్ రైట్ బట్ నాట్ ఆల్" బలవంతంగా పెదవుల మీదికి నవ్వు తెచ్చుకొని చెప్పింది.

"పెర్సనల్ కాకపోతే, నీ ప్రాబ్లమ్ ఏమిటోనాకు చెప్తే నేను చెయ్యగలిగిన హెల్ప్ చేస్తాను"

"పెర్సనల్ అని కాదు. కాని..."

"ఎలా చెప్పడం అనా?"

"ఎలా చెప్పడం ఏమిటి? ఏ విషయమైనా నేను నోటితోనే చెప్తాను. ఆదివారం మధ్యాహ్నం టి.వి. న్యూస్ లోలా సైగలద్వారా చెప్పడం నాకు రాదు"

"ఎలాగో ఒకలా చెప్పు"

"ఏం లేదు.. మా పేరెంట్స్ నాకు సెటిల్ చేసే ప్రయత్నాలు చేస్తు"

"నీకు యివ్వడే చేసుకోవడం యిష్టం లేదా?"

"కాదు"

"మరి?"

"నా ఫ్రెండ్ ప్రసాద్ తెలుసుకదా?"

"ఎవరు? మినిష్టరీ ఆఫ్ డిఫెన్స్‌లో సెక్షన్ ఆఫీసరేనా?"

"అవును. అతనే"

"తెలుసు"

"నాకు అతనంటే ఇష్టం"

"అంటే లవ్వా?"

"అఫ్‌కోర్స్. కాని మేమలా ఎవ్వడూ మాట్లాడుకోలేదు. ప్రసాద్ మాత్రం తనకి నన్ను లైఫ్‌పార్టనర్‌గా చేసుకోవాలని వుందని చెప్పాడు.కులాంతర వివాహానికి మా యింట్లో వొప్పుకోరని నాకు తెలుసు. కాబట్టి నేను సమాధానం చెప్పకుండా దాటేసాను"

"అంటే నీకు కూడా అతనితో జీవితం పంచుకోవడం ఇష్టమేనన్న మాట?"

"ఎస్. ప్రసాద్ అంటే నాకు చాలా ఇష్టం. అతనిని వదులుకోవడం నాకు ఇష్టం లేదు"

"ఆ విషయం ఇంట్లో చెప్పు"

"మా వాళ్ళు వొప్పుకోరు"

"ఎవ్వరింట్లోనూ కులాంతర వివాహానికి ఆనందంగా గెంతేసి ఒప్పుకోరు. అయినా చేసుకునేవాళ్ళు చేసుకుంటూనే వున్నారు. సమస్యలు ఆ తర్వాత అవే సర్దుకుంటాయి"

"వాకెందుకో మా యింట్లో వాళ్ళని ఎదిరించి బాధపెట్టి నేను సుఖపడడం నచ్చడం లేదు. మా యింట్లో వాళ్ళు కూడా నాకేమీ పనికి మాలిన సంబంధాలు చూడరు అనిపిస్తోంది"

"నిజమే. కానీ ఇష్టపడిన వాడిని పెళ్ళి చేసుకోడానికీ, ముక్కు మొఖం తెలియని వాడిని పెళ్ళి చేసుకుని మొగుడు కాబట్టి తప్పని సరిగా ఆ తర్వాత ఇష్టం పెంచుకోడానికీ చాలా తేడా వుంది"

"ఆ విషయం నేనూ ఒప్పుకుంటాను. పెళ్ళి చూపుల వలన ఆ అబ్బాయి వ్యక్తిత్వం తెలిసే అవకాశం ఎంత మాత్రం లేదు. అబద్ధం చెప్పకపోతే అతని వుద్యోగం, జీతం తెలుస్తాయి అంతే. కానీ ప్రసాద్ నాకు మూడు సంవత్సరాలుగా తెలుసు. అతనికి మంచి వ్యక్తిత్వం వుంది. నా వల్ల తప్పు జరిగి మా ఇద్దరి మధ్య తేడా వచ్చినా, తనే సారీ చెప్పి ఎడ్జస్ట్ అయిపోతుంటాడు. అతను లైఫ్ పార్టనర్ అయితే నా జీవితం ఆనందంగా గడిచిపోతుందనే నమ్మకం నాకు వుంది"

మరింకా ఈ ఆలోచన లెందుకని అడగాలనుకున్నాను. కాని అలా అడగడం వలన ఆమె చెప్పాలనుకున్న అభిప్రాయాలని పూర్తిగా చెప్పనీయకుండా అడ్డు తగులుతానేమోనని అనుమానం వచ్చి సింపుల్‌గా "వూ"అని వూరుకున్నాను.

లత ఇంకా చెప్పడం మొదలు పెట్టింది.

"మా వాళ్ళు ఒప్పుకుంటే నాకు నిజంగా ప్రసాద్‌ని పెళ్ళి చేసుకోవాలని వుంది. కాని మా వాళ్ళు ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోరు. నేను మాటల సందర్భంలో సరదాగా – నా సంబంధాల కోసం మీరు కష్టపడడం ఎందుకు? నేనే వెతుక్కుంటానని అన్నందుకే మా అమ్మ ఏడ్చేసి నీ చదువు టెంత్‌తోనే ఆపించేసి వుండాల్సింది డిగ్రీ చదివించి వుద్యోగానికి పంపించడం మా తప్పు, అంటూ గోల గోల చేసి నేను గనక అలాంటి పని చేస్తే తమ ఏమయ్యో, గొయ్యో చూసుకుంటావని బెదిరించింది. అఫ్‌కోర్స్ మా ఇంట్లో మయ్యి, గొయ్యి. రెండూ లేవనుకో"

"అయినా పెళ్ళయ్యాక నువ్వు కాపురం చెయ్యాల్సింది మీ ఇంట్లో కాదు. అందువలన మీ వాళ్ళు ఒప్పుకోకపోవడం సమస్య కాదు. ప్రసాద్ వాళ్ళ ఇంట్లో ఒప్పుకున్నారా?"

"సంతోషంగా ఒప్పుకోకపోయినా, అభ్యంతరం మాత్రం చెప్పరని ప్రసాద్ చెప్పాడు. అంతే కాకుండా నాకు ప్రసాద్‌వాళ్ళ ఇంట్లో అందరితోటీ పరిచయం వుంది. వాళ్ళకి నా మీద మంచి అభిప్రాయం వుంది. కాబట్టి అభ్యంతరం చెప్పరనే నమ్మకం నాకు కూడా వుంది. వాళ్ళు ఒప్పుకోకపోయినా నన్ను పెళ్ళి చేసుకుంటానని ప్రసాద్ చెప్పాడు. ఎందుకంటే ప్రసాద్‌కి ఒక అన్నయ్య వున్నాడు. ప్రసాద్‌మీద కోపం వచ్చినా వాళ్ళ తల్లిదండ్రులు అతని దగ్గర వుండగలరు"

"మరి ఇంకా ఎందుకీ ఆలోచన?"

"ఏమో నానీ. నాకు ప్రసాద్‌ని పెళ్ళి చేసుకోవాలని వుంది. కానీ ఇంట్లో వాళ్ళని ఎదిరించడం ఇష్టం లేదు. ఇంట్లో వాళ్ళని బాధపెట్టకుండా వాళ్ళు చూసిన సంబంధం చేసుకుందామంటే ఎవడో ముక్కూ, మొఖం తెలియనివాడు మెడలో సూత్రం కట్టగానే నా తనువు అర్పించడం, అతనితో జీవితం పంచుకోవడం, నాకు ఏదో అనిపిస్తోంది. ఏమి చెయ్యాలో అర్థం కావడం లేదు"

"నేనొక సలహా ఇవ్వనా?"

"ఏమిటి?"

"సలహా అంటే సలహా కాదు. నువ్వు ఏదో ఒక నిర్ణయం తీసుకోడానికి సహాయం చేస్తాను"

"ఒహ్హో. అదేదో చెప్పు"

"నువ్వు ఎటూ నిర్ణయించుకోలేక పోతున్నావు కాబట్టి ఆ నిర్ణయించే అవకాశం అదృష్టానికివ్వు"

"అంటే?"

"నీకు దేవుడి మీద నమ్మకం వుంది కదా?"

"వుంది"

"అయితే నేను రూపాయి బిళ్ళ టాస్ వేస్తాను. నువ్వు దేవుడిని తలచుకుని బొమ్మో, బొరుసో చెప్పు, కాని నువ్వు ఆ నిర్ణయానికి కట్టుబడి వుండేటట్లయితేనే ఒప్పుకో. ఎందుకంటే మనం అదృష్టంని పరీక్షిస్తున్నాం"

"ఓ.కె. నేనెలాగూ నిర్ణయించుకోలేక పోతున్నాను. ఈ నిర్ణయం ఏదో అదృష్టాన్నే నిర్ణయించనీ" రెండు నిముషాలు ఆలోచించి ఒప్పుకుంది.

నేను జేబులో నుంచి రూపాయి బిళ్ళ తీసి చెప్పాను. "బొమ్మ పడితే మీ వాళ్ళు చూసిన సంబంధం చేసుకో. బొరుసు పడితే మీ వాళ్ళని ఎదిరించైనా సరే ప్రసాద్‌ని చేసుకో"

"సరే"

"నేను కాయిన్ పైకి విసరగానే నీకు ఇష్టమైన దేవుడిని తలచుకుని బొమ్మో, బొరుసో ఏదో ఒకటి చెప్పు"

"సరే"

"రెడీ?"

"ఎస్"

"వన్, టూ, త్రీ" చెప్పి నేను కాయిన్ పైకి విసిరాను. అరసెకమపాటు కన్ను మూసి చెప్పింది "బొరుసు"

నా రెండు చేతుల మధ్యవున్న కాయిన్‌ని లతకి చూసే అవకాశం ఇవ్వకుండా (నేను కూడా చూడకుండా) నా జేబులో వేసుకుంటూ చెప్పాను "బొరుసు. విష్ యూ ఆల్‌ది బెస్ట్"

లత కూడా నన్ను అనుమానించలేదు. ఆ టెన్షన్‌లో తనకా ఆలోచనే రాలేదు.

"థేంక్యూ. ఏదో ఒక నిర్ణయానికి వచ్చినందుకు నా మనసు ఇప్పుడు ప్రశాంతంగా వుంది" చెప్పింది.

ప్రస్తుతం లత, ప్రసాద్ పెళ్ళి చేసుకొని ఆనందంగా జీవిస్తున్నారు.

*

* వాగ్దానం *

మంత్రిగారితో విన్నవించుకున్నాడు రామయ్య:

"మా కోడలికి నెలలు నిండాయి బాబుగారూ"

"అయితే నన్నేం చేయమంటావ్?"

"మర్చిపోయారా! ఓట్లు వేయించుకున్నప్పుడు మీరామెకిచ్చిన వాగ్దానం"

"ఏమని?"

"వచ్చి మీ కడుపున పుడతానని" చెప్పాడు రామయ్య

– భూక్యా గోపీనాయక్